క్లుప్తంగా

ఎర్ర బ్యాడ్జీలతో నిరసన



ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

నర్సీపట్నం : ఆర్టీసీ ఉద్యోగులు రెడ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎన్ఎంయుఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ డిపో ఉద్యోగులు బుధవారం రెడ్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 2019 ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలని డిపో గేటు వద్ద ఉద్యోగులు నిరసన తెలియజేశారు.

ఆటిజంపై చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం : ప్రపంచ ఆటిజం దినం సందర్భంగా బుధవారం మేడివాడ హైస్కూల్లో విద్యార్థులకు ఆటిజం వ్యాధిపై వ్యాసరచన , చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ వ్యాధి గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంకాయల రామారావు, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు, జగన్నాథ నాయుడు, సరోజిని విద్యార్థులకు వివరించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు.

నూకాలమ్మతల్లిని దర్శించుకున్న స్పీకర్




అమ్మవారిని దర్శించుకుంటున్న అయ్యన్న

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లిని స్పీకర్ అయ్యన్న దంపతులు బుధవారం దర్శించుకున్నారు. దేవదాయశాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి ఆధ్వర్యంలో అయ్యన్న దంపతులకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని అధికారులు, కమిటీ సభ్యులకు స్పీకర్ సూచించారు.

విద్యార్థులకు హోమియో మాత్రల పంపిణీ

బుచ్చెయ్యపేట : వడ్డాది మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు హోమియో మాత్రలు పంపిణీ చేశారు. తీవ్ర ఎండల దృష్ట్యా విద్యార్థులు వడ దెబ్బకు గురికాకుండా బుధవారం వడ్డాదికి చెందిన అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు హోమియో మాత్రలు అందించారు. మాత్రలను ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్ఎం శేషగిరిరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్న శ్రీను తనయుడికి నివాళి



ఆదిత్య ప్రణీత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస్ తనయుడు మజ్జి ఆదిత్య ప్రణీత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. బుధవారం విజయనగరం చైర్మన్ నివాసంలో జరిగిన కర్మ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య ప్రణీత్ చిత్రపటానికి నివాళులర్పించారు.

నూకాలమ్మతల్లి ఆలయం వద్ద సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : లింగంపేట నూకాలమ్మతల్లి ఆలయం వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావు తెలిపారు. ఆలయ ఈవో దివ్యతేజ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ భద్రత, పర్యవేక్షణ కొరకు వీటిని ఇక్కడ ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పని ప్రదేశాన్ని తడిపేందుకు నీరు మోసుకొస్తున్న ఉపాధి కూలీలు



చెరువుల్లో నుంచి నీటిని సేకరిస్తున్న ఉపాధి కూలీలు

- నేల గట్టిపడి తవ్వకాలకు యాతన
- గత్యంతరం లేని స్థితిలో నీటి తడుపులు
- అరకొర వసతులతో కూలీల పనులు

మండుటెండల్లో ఉపాధి వెతలు



పని ప్రదేశాన్ని నీటితో తడుపుతున్న ఉపాధి కూలీలు

దేవరాపల్లి : విపరీతమైన వేసవి ఎండలతో ఉపాధి కూలీలు అష్టకష్టాలు పడుతున్నారు. ఒక వైపు నిలువ నీడ లేక అవస్థలు పడుతుండగా, మరో వైపు పని ప్రదేశం గట్టి నేల కావడంతో తవ్వకాలకు ఇబ్బందికరంగా మారడంతో నరక యాతన అనుభవిస్తున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా పని చేసినప్పటికీ కూలీ గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉపాధి కూలీలు బిందెలు, బకెట్లతో సమీప చెరువులు, బోర్ల నుంచి నీరు తెచ్చుకొని పని ప్రదేశాన్ని తడుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే దేవరాపల్లి మండలం ముషిడిపల్లి గ్రామంలో బుధవారం ఉపాధి కూలీలు నీరు తెచ్చుకొని పని ప్రదేశాన్ని తడుపుతుండడమే కూలీలు పడుతున్న ఇక్కట్లకు నిదర్శనంగా చెప్పవచ్చు.

బుద్ధిమాంద్యం పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



బుచ్చెయ్యపేటలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



కె.కోటపాడులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈవో సత్యనారాయణ

బుచ్చెయ్యపేట : బుద్ధిమాంద్యం పిల్లల పట్ల వారి ఎదుగుదలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. బుధవారం ప్రపంచ ఆటిజం దినం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో బుద్ధిమాంద్యం పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన నిర్వహించారు. పిల్లలు అందరి పిల్లలతో కలవకుండా ఆడుకోకుండా ఒంటరిగా ఉంటే బుద్ధిమాంద్యం ఉన్నట్టు గుర్తించాలన్నారు. వైద్యులను సంప్రదించి సైకోథెరపి, స్పీచ్ థెరపీ, ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తే బుద్ధిమాంద్యం పోయి ఉత్సాహంగా మారుతారని ప్రత్యేక ఉపాధ్యాయులు పోతురాజు, కె. దేముడు తెలిపారు.

కె.కోటపాడు : ఆటిజం సమస్య 3 ఏళ్ల వయస్సులోనే చిన్నారుల్లో కనిపిస్తుందని మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం పురస్కరించుకొని కె.కోటపాడు భవిత కేంద్రం ఆధ్వర్యంలో హైస్కూల్ విద్యార్థులతో కలిసి బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో మాట్లాడుతూ పిల్లల్లో వయస్సుకు తగ్గట్టు రావాల్సిన మానసిక పరమైన ఎదుగుదల రాకుండా ఉండే పరిస్థితిని ఆటిజం అంటారని అన్నారు. ఈ సమస్యలతో ఇబ్బంది పడే చిన్నారులకు ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యం అందించడం ద్వారా వ్యాధి నుంచి బయట పడవచ్చునని అన్నారు. హెచ్ఎం పద్మావతి, సహిత విద్య ఉపాధ్యాయులు కన్నమ్మ, పరదేశి, ఉపాధ్యాయుడు ఈశ్వరరావు, సీఆర్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

మాడుగుల : మాడుగుల సబ్‌స్టేషన్‌కు పెయింటింగ్‌తో పాటు లైన్ మరమ్మతుల దృష్ట్యా గురువారం , శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని నర్సీపట్నం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ అన్నారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాడుగుల సబ్ స్టేషన్ పరిధిలో ఘాట్‌రోడ్, జంక్షన్, వాడపాడు, వీరనారాయణం, జి.అగ్రహారం, చింతలూరు, జంపెన, డి.సురవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

8న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

దేవరాపల్లి : బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 8న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సువర్ణరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 8న ఉదయం 10:30 గంటల నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈబీసీ, నిరుద్యోగ యువతి, యువకులు విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో మూడు సెట్లు దరఖాస్తులు తీసుకొని రావాలని సూచించారు.

సాంకేతికత దేశాభివృద్ధికి తోడ్పడాలి



మాట్లాడుతున్న న్యాయ విద్యాలయం ఉపకులపతి సూర్యప్రకాశరావు

మాకవరపాలెం: సాంకేతికత దేశాభివృద్ధికి తోడ్పడేలా ఉండాలని దామోదరం సంజీవయ్య న్యాయ విద్యాలయ ఉపకులపతి డి.సూర్యప్రకాశరావు విద్యార్థులకు సూచించారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం టెక్ వైబ్ పేరుతో 25వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను దుర్వినియోగం చేయకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడేలా విద్యార్థులు నడుచుకోవాలన్నారు. విజయనగరం జెఎన్‌టీయు సిఎస్‌సి హెచ్‌వోడి బిందు మాధవి మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో సృజనాత్మకత, నైతిక విలువలతో విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. విశాఖ ఎన్ఎస్‌టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ అపజయాలతోనే విజయాలను పొందొచ్చన్న ప్రముఖుల మాటలను గుర్తు చేశారు. కళాశాల వ్యవస్థాపకుడు ఎం.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు తదితరులు ప్రసంగించారు. వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

ప్రజా దర్బారులో సమస్యల వెల్లువ



ప్రజా దర్బారులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బారు నిర్వహించారు. పలువురు అర్జీదారులు ఏడాదిగా వితంతు పింఛన్లతో పాటు కొత్త పింఛన్లు అందజేయలేదని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆరు నెలల తర్వాత మృతి చెందిన భర్తలు పింఛన్లు వితంతులకు మార్పు చేస్తున్నామని తెలిపారు. భూసమస్యలపై వినతులకు స్పందిస్తూ అంచెలంచెలుగా భూ సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వివిధ సమస్యలపై ఫిర్యాదులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ నారాయణరావు పాల్గొన్నారు.

అన్ని పంచాయతీల్లోనూ ఉపాధి పనులు



ఉపాధి పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ మాజీ ఎంపీపీ సన్యాసిదేముడు

నాతవరం: మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఉపాధి పనులు రెండు రోజులు వ్యవధిలో ప్రారంభించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని ఉపాధి హమీ పథకం ఏపీవో చిన్నారావు అన్నారు. గన్నవరం పంచాయతీలో సర్పంచ్ బొడ్డు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సన్యాసిదేముడు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పని కావలసిన వారందరికీ వెంటనే ఉపాధి పథకంలో పని కల్పించాలన్నారు. వేసవిలో ప్రభుత్వం అందించే అలవెన్సులు సకాలంలో వచ్చేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఏపీవో చిన్నారావు మాట్లాడుతూ డ్వామా ప్రాజెక్టు అధికారి అదేశాల ప్రకారం పనులు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసామన్నారు. వీఆర్పీ నాగమణి, మేట్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయ కల్పనపై దృష్టి



వ్యవసాయ పనిముట్లు అందచేస్తున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం : గ్రామాల్లో తాగునీరు, సిమెంట్ రోడ్లు ,డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎమ్మెల్యే కె.ఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రాజు గ్రీవెన్స్ డే ను నిర్వహించారు. రాయితీపై వ్యవసాయ పనిముట్లు నలుగురు రైతులకు అందచేశారు. ఎంపీడీవో వెంకన్నబాబు, తహసీల్దార్ వెంకటరమణ, వ్యవసాయాధికారి రూప పాల్గొన్నారు.

రోలుగుంట : ప్రజలకు అందుబాటులో ఉండి వార్కి మేలైన సేవలందించాలని చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం పలు శాఖల అధికారులతో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు.

సీపీఎం జెండా ఆవిష్కరణ



పార్టీ జెండాను ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం : తమిళనాడులోని మధురైలో జరుగుతున్న అఖిల భారత మహాసభలు జయప్రదం కావాలని అకాంక్షిస్తూ సీపీఎం కార్యాలయం వద్ద బుధవారం పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ మూడేళ్లకోసారి జరిగే ఈ మహాసభల్లో బీజేపీ ప్రభుత్వ విధానాలతో ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యలు, రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు, కార్మికులకు కనీస వేతనాలు, ధరల పెరుగుదల, దళిత, గిరిజనులు, మహిళలు, మైనారిటీలపై జరుగుతున్న దాడులపై చర్చించి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్.గౌరి, కె.ప్రసన్న, చిరంజీవి, సూర్యప్రభ, నాగరమణ పాల్గొన్నారు.

రుణాల కోసం 632 మంది హాజరు



బుచ్చెయ్యపేటలో లబ్ధిదారులకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు



వడ్డాది ఐఓబీ బ్యాంకు సిబ్బంది రాక కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

బుచ్చెయ్యపేట : మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన బ్యాంకు రుణాల ఇంటర్వ్యూలకు 632 మంది దరఖాస్తుదారులు పాల్గొన్నారు. 35 పంచాయతీ గ్రామాల్లో ఓసీ, బీసీలకు 140 యూనిట్లు మంజూరు చేశారు. బుధవారం వడ్డాది, బుచ్చెయ్యపేట, సీతయ్యపేట, రాజాం, విజయరామరాజుపేట, ఆర్.భీమవరం గ్రామాల్లో ఉన్న స్టేట్‌బ్యాంకు, ఐఓబీ, కెనరా, గ్రామీణ బ్యాంకుల సిబ్బంది వచ్చి దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. వడ్డాది ఐఓబీ బ్యాంకు సిబ్బంది సాయంత్రం 3 గంటలు వరకు రాకపోవడంతో దరఖాస్తుదారులు ఎంపీడీవో కార్యాలయం మెట్ల వద్దే నిరీక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచితంగా మేలైన బోధన



కరపత్రాలు ఆవిష్కరించిన ఎంఈవో తదితరులు

రోలుగుంట : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలంటూ ప్రభుత్వ సంక్షేమం, బోధనకు సంబంధించిన అంశాలతో మునిపల్లికి చెందిన ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కోన చక్రవర్తి తన సొంత నిధులతో కరపత్రాలు సమకూర్చారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో వీటిని ఎంఈవో జగ్గారావు హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులతో కలసి బుధవారం ఆవిష్కరించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గొలుగొండ : గైరంపేట గ్రామంలో బిక్షాటన చేసుకొని జీవనం సాగిస్తున్న సాధువు బుధవారం గ్రామంలో చెట్టు వద్ద మృతి చెందాడు. లింగంపేట నూకాలమ్మతల్లి జాతరలో భిక్షాటన చేసుకుంటూ ఇక్కడే ఉన్న సమయంలో చనిపోవడం జరిగింది. దీనిపై సర్పంచ్ తోకల సంతోష్‌కుమార్ కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వర్రావుకు ఫిర్యాదు చేయగా పోలీసులు, రెవెన్యూ అధికారులు పరిశీలించి సర్పంచ్ గ్రామస్తులు ఆధ్వర్యంలో మృతదేహాన్ని ఊరు చివర ఖననం చేసినట్టు తెలిపారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి



ముషిడిపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

దేవరాపల్లి : ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు సంబంధించిన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఉపాధి కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు ముషిడిపల్లి,కాశీపురం గ్రామాలలో బుధవారం ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. సుమారు 9 వారాలుగా కూలీ సొమ్ము అందించక పోవడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. రెక్కాడితే డొక్కాడని తామంతా ఉపాధి కూలీ సొమ్ముపైనే ఆధారపడి జీవిస్తున్నామని, 9 నెలలుగా కూలీ సొమ్ము చెల్లించక పోతే ఏం తిని బతకాలని తీవ్రంగా మండిపడ్డారు. చట్ట ప్రకారం సకాలంలో బకాయిలు చెల్లించని ప్రభుత్వంపై ఎందుకు కేసులు పెట్టకూడదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల ఆందోళన కార్యక్రమానికి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రూ. 52 కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాదిలో చేపట్టే పనులకు రూ.7 పెంచి ఉపాధి కూలీలు పండగ చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. మండుటెండలో పని చేస్తున్న కూలీలకు ప్రభుత్వం టెంట్ సౌకర్యం కల్పించలేని స్థితిలో ఉందన్నారు. గత ప్రభుత్వంలో గునపం, తట్ట, పార, తాగునీరు, ట్రావిలింగ్ అలెవెన్స్‌లు ఇచ్చేవారని, ఇవన్నీ కట్ చేసి ఈ ప్రభుత్వం రూ.7 పెంచినట్టు గొప్పగా ప్రచారం చేసుకోవడం అన్యాయమన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించకుంటే ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

గ్రామ సచివాలయాల వద్ద చలివేంద్రాలు



కె.జె.పురం గ్రామ సచివాలయం వద్ద చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం



కింతాడలో చలివేంద్రం ప్రారంభించిన ఉప సర్పంచ్ ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ సచివాలయం వద్ద బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. పంచాయతీ జూనియర్ సహాయకులు ఏడువాక సత్యనారాయణ ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : వేసవికాలంలో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడాన్ని యువకులు సామాజిక బాధ్యతగా గుర్తించాలని కింతాడ ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు అన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పాదచారులకు మంచి నీటిని అందించారు. పంచాయతీ కార్యదర్శి అనురాధ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు తాగునీటి కుండీలు



కుండీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం : పశువులకు తాగునీటి కుండీలను నిర్మించనున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. మండలంలోని భీమబోయినపాలెంలో నీటి కుండీల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ పశువులు నీరు తాగేందుకు ఉపాధి హామీ పథకం నిధులతో కుండీలను నిర్మిస్తామన్నారు. ఉపాధి పథకంలో పంట కుంటలు, సాగునీటి కాలువ పూడిక తొలగింపు, చెరువుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నందకిషోర్, ఏపీవో వరలక్ష్మి, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక కార్యకర్తపై దాడి కేసులో పురోగతి ఏదీ...



శివనారాయణరాజుకు సంఘీభావం తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నర్సీపట్నం : సామాజిక కార్యకర్త శివనారాయణరాజుపై దాడి జరిగి రెండు వారాలు గడుస్తున్నా నేటికి కేసులో పురోగతి లేకపోవడం బాధాకరమని బిఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బొట్టా నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన కొంత మంది ప్రజాసంఘాల నాయకులు శివనారాయణరాజును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివనారాయణరాజుపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులపై జరిగిన దాడి అన్నారు. డీఎస్పీని స్వయంగా కలిసి విన్నవించినా ఎలాంటి పురోగతి లేదన్నారు. కేసును పోలీసులు నీరు గారిస్తే శివనారాయణరాజు తరపున శాంతియుతంగా ఆందోళన చేపడతామని నాగరాజు పేర్కొన్నారు. సామాజిక కార్యకర్తను పరామర్శించిన వారిలో కె.త్రిమూర్తుల రెడ్డి, ఎం.చిట్టియ్య తదితరులు ఉన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు

నర్సీపట్నం : మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర పర్యవేక్షణలో బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహించారు. 380 మంది దరఖాస్తులు చేసుకోగా, ఇంటర్వ్యూలకు మాత్ర 300 మంది హాజరైనట్టు కమిషనర్ తెలిపారు. ఎంపికైన వారికి దశల వారీగా సబ్సిడీ రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. మెప్మా కోఆర్డినేటర్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ వాసవీ సేవా సంఘం వితరణ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ

నాతవరం : మండల కేంద్రంలో బుధవారం అమ్మ వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. సేవా సంఘం మండల శాఖ అధ్యక్షురాలు ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ మాట్లాడుతూ పదేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు అవసరమైన దుస్తులు, పుస్తకాలు, సామగ్రి పంపిణీ చేస్తున్నామన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆనాథాశ్రమంలోని వారికి రుచికరమైన భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేసవిలో ప్రయాణికుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం 200 మంది పేదలకు దస్తులు అందజేసి, భోజనాలు వడ్డించారు. సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు బుల్లిదొర, సభ్యులు పాల్గొన్నారు.